క్లుప్తంగా

ఆరుతెగళపాడులో శ్మశాన భూ వివాదం

కలిదిండి(కైకలూరు): శ్మశాన భూ సమస్య రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. కలిదిండి మండలం కాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని ఆరుతెగళపాడు దమ్మిడి డ్రెయిన్ పోరంబోకు స్థలం అర ఎకరాన్ని వరహాపట్నం గ్రామానికి చెందిన పళ్లెం నాగస్వామి బంధువుల ఆధీనంలో ఉంది. ఈ భూమిపై ఆరుతెగళపాడు గ్రామస్తులు ఊరి అవసరాలకు కావాలని కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఇరు వర్గాలు కోర్టులో కేసులు సైతం నమోదు చేసుకున్నారు. పోరంబోకు పొలానికి శిస్తులు కట్టామని భూమి తమకే చెందుతోందని పట్టా సైతం ఉందని తహసీల్దారు రామకృష్ణను నాగస్వామి కలిసి వివరించారు. విచారణ చేసి 16 ఏళ్లకే పట్టా ఇవ్వరని ఫేక్‌గా చెప్పారు. దీంతో జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామస్తులు ట్రాక్టర్లతో శ్మశానానికి మట్టిని పూడుస్తున్నారు. ఈ విషయం తెలిసి వరహాపట్నం నుంచి నాగస్వామి కుటుంబ సభ్యులు, దళిత నాయకులు స్థలం వద్దకు వెళ్లారు. ఆరుతెగళపాడు గ్రామస్తులు సైతం ఇక్కడే ఉన్నారు. వివాదం పెద్దది కావడంతో తహసీల్దారు రామకృష్ణ, ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు వారితో మాట్లాడి ఫిర్యాదులను తీసుకున్నారు. తాత్కాలికంగా శ్మశాన వాటిక పూడిక పనులు ఆగాయి.

క్రీడాపోటీల్లో పసుమర్రు విద్యార్థుల ప్రతిభ

పసుమర్రు(పామర్రు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల్లో పసుమర్రు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని హెచ్‌ఎం హనుప్రసాద్ పేర్కొన్నారు. విజేతలను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 16న జరిగిన అండర్–14 బాలుర వాలీబాల్ పోటీల్లో దినేష్ కార్తీక్, వినుతేజ, అక్షిత్ నాగ పవన్ ఎంపికయ్యారని తెలిపారు. అదేవిధంగా అండర్–17 కబడ్డీలో నాగ సాయి, ప్రవీణ్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు త్వరలో గుడివాడలో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో..

మండవల్లి: రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో కానుకొల్లు విద్యార్థులు ప్రతిభ చాటి తృతీయ స్థానం సాధించారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన ఈదర సుబ్బమ్మ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల్లో ఈ పోటీలు జరిగాయి. కానుకొల్లు కస్తూరిబాయి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు లంకపల్లి రుక్మిణీదేవి, మువ్వల ఝాన్సీస్వరూప, గోపోతుల సౌమ్యకీర్తి తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను ఎస్‌ఎంసీ చైర్మన్ మాధవి అభినందించారు.

మందుల ప్రతిచర్యలపై అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: ఔషధాల (మందుల) ప్రతిచర్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక విజయ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ డైరెక్టర్ కె.తనూజ, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ అన్నారు. జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ముదినేపల్లిలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకే మందులు వాడాలన్నారు. అధిక మందుల వినియోగం శరీరంపై దుష్పరిణామాలు చూపే ప్రమాదముందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని డైరెక్టర్ తనూజ ప్రారంభించారు. విద్యార్థులు ప్రధాన రోడ్ల మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

మానసిక సామర్థ్యాలకు అనుగుణంగా బోధన

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక విద్యార్థుల మానసిక సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని సంఘర్షణపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతుల వారీ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఇంగ్లిష్, లెక్కలు వంటి సబ్జెక్టుల పై ఉన్న భయాన్ని పోగొట్టే సులభశైలిలో బోధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ సక్రమంగా అమలు చేయాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు

క్రీడలతో మానసికోల్లాసం

మొవ్వ: ఆటల పోటీలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడంతో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందని పాఠశాల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బాబురావు పేర్కొన్నారు. మొవ్వ పీఎంశ్రీ శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్లో బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో అండర్–14, అండర్–17 బాల బాలికలకు బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించారు.

నిరుపయోగంగా మోడల్ సచివాలయం

పట్టించుకోని అధికారులు



ప్రారంభ సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం



పెదపారుపూడిలో నిరుపయోగంగా మారిన నూతన సచివాలయ భవనం

పెదపారుపూడి: పెదపారుపూడిలో అధికారుల నిర్లక్ష్యంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మోడల్ సచివాలయ భవనం నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. 2024 జనవరి 22వ తేదీన అప్పటి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఈ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అప్పట్లో మండలంలోనే పెదపారుపూడి సచివాలయాన్ని మోడల్ భవనంగా నిర్మించారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనుల కోసం రూ.67.54 లక్షలు ఖర్చు చేశారు. ఈ మోడల్ సచివాలయాన్ని ప్రారంభించారు. అయితే నాటి నుంచి నేటి వరకు సచివాలయంలో నిధులు నిర్వహించటం లేదనే విమర్శలున్నాయి. అధికారులు ఇంత వరకు సచివాలయంలోకి వెళ్లలేదు. దీంతో పాత పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగానే..

రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సచివాలయం భవనం కూడా ఎంపీడీఓ కార్యాలయంలో ఎదురుగానే ఉంది. ఈ విషయం కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా ఆ భవనంలోకి ఎందుకు వెళ్లడం లేదో అనే ప్రశ్న చిక్కుముడిగా మారింది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి సచివాలయ భవనాన్ని వాడుకలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

దేవస్థాన చైర్మన్‌గా మోహన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన ధర్మకర్తల మండలి సభ్యులు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన చైర్మన్‌గా ఈడె వెంకట విష్ణు మోహనరావు(మోహన్) బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ వెంకటేశ్వరరావు విచ్చేసి ప్రమాణస్వీకారం చేసిన నూతన ధర్మకర్తల మండలిని అభినందించారు.

22నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను గుడివాడ ఎమ్మెల్యే రాము బుధవారం ఆవిష్కరించారు.

ఆలయానికి టీవీ బహూకరణ

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి దాతలు ఎల్‌ఈడీ టీవీని బుధవారం బహూకరించారు. శ్రీహరిపురానికి చెందిన పాతూరి మల్లికార్జునరావు, నిత్యానందరేణుకాదేవి దంపతులు ఆలయంలో ప్రతిరోజూ జరిగే స్వామి అభిషేకాలు భక్తులు చూసేందుకుగాను టీవీని బహూకరించారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో టీవీని అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ముదినేపల్లి రూరల్: మనస్థాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన జుజ్జువరపు రాజు(39), గ్లోరీ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. రాజు ప్రతీరోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్య గ్లోరి మద్యం మాని వేయమని మందలించేది. దీంతో మనస్థాపానికి గురైన రాజు పురుగులమందు తాగి భార్యకి చెప్పడంతో వెంటనే గుడివాడ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ రాజు బుధవారం మృతి చెందాడు. రాజు భార్య ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వి.పెద్దిరాజు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి వితరణ

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి భక్తులు రూ.25,116 వితరణ అందజేసినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ తెలిపారు. బుధవారం గుడ్లవల్లేరు మండలం పెసరమిల్లి గ్రామానికి చెందిన అల్లూరి రామశాస్త్రులు–లలితాదేవి దంపతులు ఈ మొత్తాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తుపాకుల సోమాచారి అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, తాత్కాలిక సర్పంచ్ కేవీఎన్‌ఎం.నాయుడు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: కూడలి వద్ద విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పలువురు విశ్వకర్మలకు సన్మానం చేశారు.

సంక్షిప్త వార్తలు

ఇళ్ల పట్టాల పంపిణీ

మండవల్లి: స్థానిక శ్రీ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. 2006వ సంవత్సరంలో రెవెన్యూ ఆధ్వర్యంలో అందజేసిన స్థలాలకు ఆయన పట్టాలు అందజేశారు. తహసీల్దార్ కె.గోపాల్, నాయకులు దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల, సర్పంచ్ మెండా ఝాన్సీ పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ మండల కమిటీ ఎన్నిక

గుడ్లవల్లేరు: విశ్వ బ్రాహ్మణ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేముల వెంకటరత్నాచార్యులు, కార్యదర్శిగా కొమ్మూరి నాగ వెంకట హనుమాన్‌రావు, కోశాధికారిగా జయరామ్, సభ్యులుగా పెంటపాటి చిట్టిబాబు, ఎస్.నాగమల్లేశ్వరరావు, ధనుంజయను ఎన్నుకున్నారు.

22 నుంచే దసరా సెలవులు ఇవ్వాలి

గుడివాడ టౌన్: పాఠశాలలకు దసరా సెలవులు సాంప్రదాయాల ప్రకారం ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. ఇమ్మానుయేల్, డి. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో దసరా ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలకు 22వ తేదీ నుంచే సెలవులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 24 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు ప్రకటించిందని పేర్కొన్నారు. అయితే తెలంగాణాలో సైతం 22వ తేదీ నుంచి సెలవులు ప్రకటించారని తెలిపారు. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకుని ఈ నెల 22వ తేదీ నుంచి సెలవులు మంజూరు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

విద్యాభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం

గుడివాడ టౌన్: విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావడం అభినందనీయం అని ఎంఈఓ–1 సీహెచ్ రజిని అన్నారు. బుధవారం స్థానిక నాగవరప్పాడు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు యాదవ సేవాసంఘం ఫ్యాన్ అందజేసినట్లు ఆమె తెలిపారు. సేవా సంఘం సభ్యుడు పల్లపోతు వెంకట నాగబాబు వితరణతో కార్యక్రమం చేపట్టామని ఆ సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌కే నూర్జహాన్ పాల్గొన్నారు.

చిరుపొట్ట దశలో జాగ్రత్తలు తీసుకోవాలి

కొమరవోలు(పామర్రు): వరిసాగులో చివరి దఫా చిరుపొట్ట తగిలినప్పుడు ఎకరానికి 20 కేజీల యూరియా, రెండు కిలోల పొటాష్ వేయాలని పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని కొమరవోలు, జమీగొల్వేపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ శివ నాగరాణి, వీఏఏలు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించినట్లు కేకేఆర్ గౌతమ్ ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు. బుధవారం బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 14న త్రివేణి స్కూల్లో జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో తమ విద్యార్థులు ఎన్.కిరణ్, పుర్వాష్‌సాయి, ఎం. దియాన్, ఎన్. దివాష్ శ్రీరెడ్డి, సీహెచ్ శర్వాణ్ ఆదర్శ్ ప్రథమ బహుమతి, ఎ. లోషిక్ ద్వితీయ బహుమతి సాధించారన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన మేలు

కైకలూరు: సామూహిక ఎలుకల నిర్మూలనతో రైతులకు మేలు జరుగుతుందని కైకలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.పార్వతి తెలిపారు. వేమవరప్పాడు, తామరకొల్లు, రాచపట్నం గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పైరు ఎదుగుదల దశలో ఆకులు, పిలకలను ఎలుకలు కొట్టివేయడంతో పాటు కుదురు తగిలి చిరు పొట్ట దశలో ఉన్న వరి పైరును కూడా నాశనం చేస్తాయన్నారు. వరిలో 15 నుంచి 20 శాతం వరకు ఎలుకల వలన వివిధ దశల్లో నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రస్తుతం సరైన సమయం కనుక వెంటనే రైతులందరూ సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రోమోడయోలోన్ అనే మందును 100 శాతం సబ్సిడీపై రైతులందరికీ ఉచితంగా అందిస్తుందన్నారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.దివ్య మాట్లాడుతూ మండలం మొత్తానికి 11 కేజీల బ్రోమోడయోలోన్ మందు అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం బ్రోమోడయోలోన్ మందు బాగా కలిపి 10 నుంచి 15 గ్రాముల పొట్లాలుగా చేసుకొని ఎలుక కలుగుల దగ్గర ఉంచాలన్నారు. వీటిని తీసుకున్న ఎలుకలు చనిపోతాయని తెలిపారు.

ఎన్‌సీసీ శిక్షణలో ఏఎన్నార్ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: ఎన్‌సీసీ శిక్షణలో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి బహుమతులు సాధించారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. బుధ వారం కళాశాల యాజమాన్యం బహుమతులు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ 19 ఆంధ్రబెటాలియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఏడు నుంచి 16వ తేదీ వరకు తాడేపల్లిగూడెంలో జరిగిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో తమ విద్యార్థులు సీహెచ్ సన్ని, పి.వెంకట రమణ, ఎస్. ప్రేమ్‌కుమార్, బి. మానస ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎండీ సలీమ్‌ను కళాశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్‌ఎస్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి



మొవ్వలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పెదమద్దాలి(పామర్రు): తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని వినియోగించడంతో రక్త హీనత తగ్గుతుందని ఐసీడీఎస్ పెదమద్దాలి సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.విజయ కుమారి పేర్కొన్నారు. మండలంలోని పెదమద్దాలి అంగన్‌వాడీ కేంద్రం–6లో 8వ రాష్ట్రీయ పోషణ మాసం–2025 'సుపోషిత్ భారత్, సక్షం భారత్' కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 17 నుంచి వచ్చేనెల 16వ తేదీ వరకు గర్భిణులు, బాలింతలకు రక్త హీనత నివారణపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: ముళ్లపూడి అంగనవాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం 'సుపోషిత్ భారత్, సక్షం భారత్' కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లల పోషణ, సంరక్షణ, ఒబెసిటీ రాకుండా తీసుకోవాల్సిన చర్యలను తల్లులకు అంగనవాడీ కార్యకర్త ప్రేమలత తెలియజేశారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

గుడివాడ టౌన్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని బాపూజీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు డాక్టర్ డేవిడ్ ట్విన్సన్ అన్నారు. బుధవారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో మహిళలకు, కిషోర బాలికలకు స్వస్థ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ విజయా ఫ్లారెన్స్, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: కపిలేశ్వరపురం గ్రామంలో స్వస్థ నారీ– స్వశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో నోటిక్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. వైద్యులు బాలాజీ, ఇందు రోగులకు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: ఆరోగ్యవంతమైన మహిళలే బలమైన కుటుంబానికి పునాదని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో అక్టోబర్ రెండో తేదీ వరకు నిర్వహించే స్వస్థ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వైద్యాధికారులతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. 104 సంచార వైద్యశాల ద్వారా ఆయా గ్రామాల్లో మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలోఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, వైద్యాధికారులు డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి, డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కైలేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్‌కుమార్, నాయకులు

పామర్రు: పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌పై కూటమి నాయకులు చేసే అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. పామర్రులో బస్టాండ్, సీహెచ్‌సీలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే సాధించామని గుర్తు చేశారు. పెదపారుపూడి మండలం నాగాపురం దళితుల భూమి సమస్యను తీర్చకుండా, పక్కదోవ పట్టించే విధంగా టీడీపీ నేతలు మాట్లాడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అవినీతి రహిత పాలన అందించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎంతో మంది దోచుకోవడం దాచుకోవడమే పనిగా చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు రమేష్ మాట్లాడుతూ కూటమి నేతలకు పరిపాలన చేతగాక వైఎస్సార్ సీపీ నాయకులపై అభాండాలు వేస్తున్నారన్నారు. దళితుల భూములకు న్యాయం చేయాలని పోరాటాలు చేస్తుంది వైఎస్సార్ సీపీనే అని, న్యాయం చేయమని కోరితే అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చింతలపూడి గవాస్కరరాజు మాట్లాడుతూ పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని దోచేస్తున్నది టీడీపీ నేతలు కాదా అని ప్రశ్నించారు. జనసేన ఇన్‌చార్జి నరేష్ తన పార్టీ తరఫున మాట్లాడటం మానేసి ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు భజన చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి అత్యున్నతంగా జరిగిందన్నారు. నాయకుడు నడకుదురు రాజేంద్ర, పామర్రు ఉప సర్పంచ్ బాలవెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ తీర్మానించిన పనులను పంచాయతీ నిధులతో చేస్తే దానిని టీడీపీ తాము ఇచ్చినట్లుగా బిల్డప్ ఇవ్వడం దారుణమన్నారు. పార్టీ నాయకులు కొంతి వెంకటేశ్వర రావు, కూసం పెదవెంకటరెడ్డి, ఆరేపల్లి శ్రీనివాసరావు, సురేష్‌రెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, పెయ్యల రాజు, చంద్రపాల్, మీర్జా అలీ, నత్తా రవి తదితరులు పాల్గొన్నారు.